క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

జనగామ రూరల్: 2024–25 విద్యాసంవత్సరానికి మండలంలోని చౌడారం మోడల్ కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ విద్యాధర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 31వ తేదీ లోగా ఆన్‌లైన్‌లో ఎలాంటి ఫీజు లేకుండా నమోదు చేసుకోవచ్చని అన్నారు. కళాశాలలో ఆంగ్ల మాధ్యమంలో విద్యాబోధన, అలాగే 100 మంది విద్యార్థినులకు ఉచిత హాస్టల్ భోజన వసతి ఉందన్నారు. ఉచిత పాఠ్యపుస్తకాలతో పాటు విశాలమైన క్రీడా మైదానం ఉందని తెలిపారు. గతేడాది 80 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని పేర్కొన్నారు.

ఎన్నికల విధులకు 792 మంది పోలీసు సిబ్బంది

పాలకుర్తి/పాలకుర్తి టౌన్: నియోజవర్గంలో పోలింగ్ ప్రశాంతంగా నిర్వహించేందుకు 792 మంది పోలీసు సిబ్బందిని ఏర్పాటు చేసినట్లు ఏసీపీ అంబటి నర్సయ్య తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా సహకరించాలని కోరారు. సమస్యాత్మక ప్రాంతాల్లో కట్టుదిట్టమైన పోలిస్ బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందని చెప్పారు.

విద్యుదాఘాతంతో దుక్కిటెద్దు మృతి



పాలకుర్తి: విద్యుదాఘాతంతో దుక్కిటెద్దు మృతి చెందింది. ఈ ఘటన మండలంలోని గూడూరు గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. బాధిత రైతు నర్సయ్య తెలిపిన వివరాల ప్రకారం.. దుక్కిటెద్దు పొలంలో ఉన్న ట్రాన్స్‌ఫారానికి తగిలి విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందింది. ఎద్దు విలువ రూ 50 వేలు ఉంటుందని, ప్రభుత్వం సాయం అందించి ఆదుకోవాలని బాధిత రైతు కోరారు.

కృష్ణయ్యపై దాడిని ఖండించాలి

కాజీపేట: వైఎస్సార్ సీపీ అభ్యర్థుల విజయాన్ని ఆకాంక్షిస్తూ ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎంపీ, బీసీ సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్యపై గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేసి గాయపర్చడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు బీసీ సంక్షేమ సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు బైరి రవికృష్ణ గౌడ్ తెలిపారు. కాజీపేట 61వ డివిజన్ ప్రశాంత్‌నగర్ కాలనీలోని సంఘం జిల్లా కార్యాలయంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం శ్రీకాళహస్తి నియోజకవర్గంలో ప్రచారంలో ఉన్న కృష్ణయ్యపై దాడి చేసిన కూటమి దుండగులపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఓటమి భయంతోనే వైఎస్సార్ సీపీ అభ్యర్థులపై దాడులకు తెగబడుతున్న వారిని శిక్షించాలని విజ్ఞప్తి చేశారు.

శ్వేతార్కలో పుత్రకామేష్టి యాగం



కాజీపేట: కాజీపేట పట్టణంలోని స్వయంభూ శ్వేతార్క మూలగణపతి దివ్యక్షేత్రంలో ఆదివారం పుత్ర కామేష్టి యాగాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ వైదిక కార్యక్రమాల నిర్వాహకుడు అయినవోలు రాధాకృష్ణ శర్మ ఆధ్వర్యంలో వేదపండితులు ప్రత్యేక యాగశాలలో పుత్రకామేష్టి యాగం చేశారు. పిల్లలు కావాలని ఆకాంక్షిస్తూ దాదాపు వంద జంటలు యాగంలో పాల్గొన్నాయి. వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య పాయసం వండి భక్తులకు పంపిణీ చేశారు. అనంతరం దేవాలయ అభివృద్ధి కమిటీ పర్యవేక్షణలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ పరిపాలన అధికారి సాయికృష్ణ శర్మ, ఆలయ ఇన్‌చార్జ్ చొక్కారపు శ్రీనివాస్, వెంకటేశ్వర్లు శర్మ తదితరులు పాల్గొన్నారు.

మెట్టుగుట్టపై ప్రత్యేక పూజలు

మడికొండ: వైశాఖ పంచమి, ఆరుద్ర నక్షత్రం, ఆదిశంకరాచార్య జయంతిని పురస్కరించుకొని మెట్టు రామలింగేశ్వరస్వామి ఆలయంలో మెట్టు రామలింగేశ్వరస్వామి సేవా సమితి ఆధ్వర్యంలో అర్చకులు రాగిచేడు అభిలాష్‌శర్మ మంత్రోచ్ఛరణల మధ్య స్వామివారికి ఆదివారం రుద్రాభిషేకం, లక్ష పుష్పార్చన చేశారు. పూజా కార్యక్రమంలో కార్యనిర్వాహణాధికారి శేషుభారతి, చైర్మన్ పైడిపాల రఘుచందర్, పరాశరం విష్ణువర్ధనచార్యులు, పారుపల్లి సత్యనారాయణ శర్మ, ధర్మకర్తలు బైరి రాజుగౌడ్, రొడ్డ దయాకర్, దండిగం శ్రీనివాస్, వస్కుల ఉమ, బోగి కేదారి, మాడిశెట్టి జ్ఞానేశ్వరి, భక్తులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.



పాలకుర్తిలో పోలింగ్ సామగ్రి పంపిణీని పరిశీలిస్తున్న కలెక్టర్ రిజ్వాన్ భాషా, అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్



స్టేషన్‌ఘన్‌పూర్: డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌లో సూచనలు చేస్తున్న ఆర్డీఓ వెంకన్న



బచ్చన్నపేట: తమ్మడపల్లిలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ కొమురయ్య, తహసీల్దార్ విశాలాక్షి



స్టేషన్‌ఘన్‌పూర్: ఈవీఎంలు, ఎన్నికల సామగ్రితో పోలింగ్ కేంద్రాలకు బస్సులో వెళ్తున్న పీఓలు, ఏపీఓలు

పోలింగ్‌కు సర్వం సిద్ధం

- ఎన్నికల అధికారులకు ఈవీఎంలు, వీవీప్యాట్‌ల పంపిణీ



స్టేషన్‌ఘన్‌పూర్: పంపిణీ కేంద్రంలో ఈవీఎంలు, ఎన్నికల సామగ్రితో పీఓలు, ఏపీఓలు

స్టేషన్‌ఘన్‌పూర్: నేడు(సోమవారం) నిర్వహించనున్న పార్లమెంట్ ఎన్నికలకు నియోజకవర్గంలోని వివిధ పోలింగ్ కేంద్రాల్లో సర్వం సిద్ధం చేశారు. ఈ మేరకు స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఈవీఎంలు, ఎన్నికల సామగ్రి డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌లో ఆర్డీఓ, నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి డీఎస్ వెంకన్న, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుహాసిని పర్యవేక్షణలో పీఓలు, ఏపీఓలు, ఓపీఓలు, ఎన్నికల సిబ్బందికి ఈవీఎంలు, వీవీ ప్యాట్‌లు, సామగ్రిని ఆదివారం పంపిణీ చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎన్నికల అధికారులు, సిబ్బందికి ఎన్నికల సామగ్రిని అందజేశారు. ఈవీఎంలు, వీవీ ప్యాట్‌లు తదితర ఎన్నికల సామగ్రి పంపిణీలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఏసీపీ భీమ్‌శర్మ, సీఐ ముస్కు రాజు, ఎస్సైలు నాగరాజు, వినయ్, శీలం రవి తదితరుల ఆధ్వర్యంలో ప్రత్యేక పోలీసు బలగాలు బందోబస్తు నిర్వహించారు. ఘన్‌పూర్ నియోజకవర్గంలో ఏడు మండలాలకు గాను మొత్తం 295 పోలింగ్ కేంద్రాలుండగా ఆయా పోలింగ్ కేంద్రాలను 35 సెక్టార్లుగా విభజించి 35 రూట్‌లను ఏర్పాటు చేశారు. ప్రిసైడింగ్ అధికారులు 335, ఏపీఓలు 335, ఓపీఓలు 670 మంది, మైక్రో అబ్జర్వర్లు 33, బీఎల్ఓలు 295, బూత్ లెవల్ సూపర్‌వైజర్లు 296, రూట్ ఆఫీసర్లు 35 మందిని కేటాయించినట్లు ఆర్డీఓ తెలిపారు. ఈవీఎంల పంపిణీ కేంద్రంలో 35 కౌంటర్లు ఏర్పాటు చేసి కంట్రోల్ యూనిట్, వీవీ ప్యాట్, బ్యాలెట్ యూనిట్, గ్రీన్ పేపర్ సీల్స్, స్పెషల్ ట్యాగ్స్, అదర్‌ట్యాగ్స్, పింక్ సీల్స్, టెండర్ బ్యాలెట్లు తదితర ఎన్నికల సామగ్రిని అందించామన్నారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు పోలింగ్ అధికారులు తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు బస్సులలో చేరుకున్నారు.



జఫర్‌గఢ్: తమ్మడపల్లి(జ)లో..



చిల్పూరులో..

బచ్చన్నపేటలో..

బచ్చన్నపేట: మండలంలో నేడు(సోమవారం) జరుగనున్న పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల సిబ్బంది 288 మంది ఆదివారం సాయంత్రం ఆయా గ్రామాలకు చేరుకున్నారు. ఈవీంలతో సిబ్బంది మండలంలోని 47 పోలింగ్ కేంద్రాలకు సిబ్బంది వచ్చారని ఎంపీడీఓ రఘురామకృష్ణ, తహసీల్దార్ విశాలాక్షిలు తెలిపారు. పోలింగ్ కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు.

పాలకుర్తి నియోజకవర్గంలో..

పాలకుర్తి/పాలకుర్తి టౌన్: నియోజకవర్గంలో 6 మండలాల పరిధిలో 296 పోలింగ్ కేంద్రాలకు ఎన్నికల సామగ్రిని అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్ తరలించారు. తెలంగాణ సాంఘిక సంక్షేమ విద్యాలయంలో ఏర్పాటు చేసిన ఎన్నికల సామగ్రి పంపిణీని ఆదివారం కలెక్టర్ రిజ్వాన్‌బాషా పరిశీలించారు. ఉదయం నుంచే ప్రిసైడింగ్ అధికారులు ఎన్నికల సామగ్రితో ఏపీఓలు, పీఓలు పోలింగ్ కేంద్రాలకు తరలించారు. 43 మంది సెక్టోరియల్ అధికారులు, 296 బూత్ లెవల్, 29 మంది సూపర్‌వైజను ఏర్పాటు చేశారు. నియోజకవర్గంలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేయడం జరిగిందని అధికారులు తెలిపారు.

జఫర్‌గఢ్: పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా మండలంలోని ఆయా గ్రామాల్లో పోలింగ్ నిర్వహణకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను ఎన్నికల అధికారులు సిద్ధం చేశారు. పోలింగ్ సిబ్బంది ఆయా పోలింగ్ కేంద్రాలకు ఆదివారం సాయంత్రం చేరుకున్నారు. మొత్తం 43 పోలింగ్ కేంద్రాల్లో ఒక్కో పోలింగ్ కేంద్రానికి 5గురు చొప్పున ఎన్నికల సిబ్బందిని నియమించారు. కాగా, పోలింగ్ నిర్వహణలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గట్టి పోలీస్ బందోబస్త్‌ను ఏర్పాటు చేసినట్లు స్థానిక ఎస్సై రవి యాదవ్ తెలిపారు.

పోలింగ్ కేంద్రాలకు చేరిన ఈవీఎంలు

రఘునాథపల్లి: లోక్‌సభ ఎన్నికల కోసం మండలంలోని 56 పోలింగ్ కేంద్రాలకు ఆదివారం సాయంత్రం ఎన్నికల సిబ్బంది ఈవీఎంలు, పోలింగ్ సామగ్రితో చేరుకున్నారు. మండలంలోని 44,141 ఓటర్లకు సోమవారం జరిగే పోలింగ్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. దివ్యాంగ ఓటర్లకు కూడా పోలింగ్ కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు చేసినట్లు అధికారులు పేర్కొన్నారు. పోలీస్ బలగాలు మండలంలో పటిష్ట బందో బస్తు చేపట్టాయి. మండలంలో ప్రశాంతగా ఎన్నికలు జరిగేలా అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని ఎస్సై దూదిమెట్ల నరేష్ కోరారు.

లింగాలఘణపురంలో..

లింగాలఘణపురం: నేటి లోక్‌సభ ఎన్నికలకు అధికారులు అంతా సిద్ధం చేశారు. మండలంలో మొత్తం ఓటర్లు 32,701 మంది ఓటర్లు ఉండగా అందులో మహిళలు 16,550, పురుషులు 16,051 ఉన్నారు. మండలంలో పోలింగ్ బూత్‌లు 38 ఉన్నాయి. ఆదివారం సాయంత్రం ఎన్నికల అధికారులు, సిబ్బంది పోలింగ్ కేంద్రాలకు తరలి వచ్చారు. వారికి ఆయా పంచాయితీల ఆధ్వర్యంలో కార్యదర్శులు తగిన ఏర్పాట్లు చేశారు.

చిల్పూరు: నేడు(సోమవారం) ఎంపీ ఎన్నికల నేపథ్యంలో స్టేషన్‌ఘన్‌పూర్ డివిజన్ కేంద్రం నుంచి ఆదివారం సాయంత్రం చిల్పూరు మండలంలోని 38 పోలింగ్ కేంద్రాలకు ఈవీఎంలు, సామగ్రి చేరుకున్నాయి. అన్ని పోలింగ్ కేంద్రాల్లో సిబ్బందికి, ఓటర్లకు సౌకర్యాలు కల్పించారు.

జనగామ రూరల్: మండలంలోని అన్ని గ్రామాలకు పోలింగ్ అధికారులు సంబంధిత ఎన్నికల సామాగ్రితో చేరుకున్నారు. మండల వ్యాప్తంగా మొత్తం 43 పోలింగ్ కేంద్రాలకు 172 పోలింగ్ సిబ్బంది విధుల్లో పాల్గొననున్నారు. మండలంలో సుమారుగా 35 వేలకు పైగా ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఆదివారం ఎంపీడీఓ సంపత్‌కుమార్ పలు పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. సిబ్బందికి తగు సూచనలు చేశారు.

దేవరుప్పుల: దేవరుప్పుల మండలంలోని 32 గ్రామ పంచాయతీలకుగానూ 41 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయగా ఎన్నికల అధికారులు, సిబ్బంది తమ సామాగ్రితో చేరారు. ఐదురుగు సెక్టార్ అధికారులు టి.సురేష్‌కుమార్, విద్యాసాగర్, సౌజన్య, శశిధర్‌రెడ్డి, అరుణ్‌కుమార్‌ల పర్యవేక్షణలో ఎన్నికల పోలింగ్ నిర్వహణకు ఎలాంటి ఇబ్బందులు జరుగకుండా చర్యలు చేపడుతున్నట్లు ఎన్నికల అసిస్టెంటు రిటర్నింగ్ అధికారి హుస్సేన్ తెలిపారు. పాలకుర్తి సీఐ గట్ల మహేందర్‌రెడ్డి పర్యవేక్షణలో స్థానిక ఎస్సై ఎస్ చెన్నకేశవులు ఎస్ఎస్‌బి బలగాలతోపాటు పోలీసు సిబ్బందితో సమస్యాత్మక గ్రామాల్లో ప్రత్యేక దృష్టి సారిస్తూ ఎన్నికలు సజావుగా కొనసాగేలా నిఘాపెట్టారు.



బచ్చన్నపేటకు చేరుకున్న పోలింగ్ సిబ్బందితో ఎంపీడీఓ రఘురామకృష్ణ



పాలకుర్తి: సామగ్రితో పోలింగ్ కేంద్రాలకు వెళ్తున్న సిబ్బంది



జనగామ రూరల్: పోలింగ్ సిబ్బందితో ఎంపీడీఓ సంపత్‌కుమార్



రఘునాథపల్లి: ఇబ్రహీంపూర్‌లో..



లింగాలఘణపురంలో..



స్టేషన్‌ఘన్‌పూర్: సామగ్రితో సిబ్బంది



జఫర్‌గఢ్: తమ్మడపల్లి (ఐ) పోలింగ్ కేంద్రంలో..



దేవరుప్పుల: స్వాగత తోరణం



దేవరుప్పుల హైస్కూల్‌లో వేసిన టెంటు

మెరిట్ విద్యార్థులకు సన్మానం



సన్మానం పొందిన విద్యార్థులు

జఫర్‌గఢ్: 2023–24 విద్యా సంవత్సరంలో ఇంటర్, పదో తరగతిలో మెరిట్ సాధించిన అర్యవైశ్య విద్యార్థులకు అవోపా ఆధ్వర్యంలో స్థానిక అర్యవైశ్యభవనంలో సన్మాన కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అవోపా మండల శాఖ అధ్యక్షుడు అంచూరి సురేష్ మాట్లాడుతూ విద్యార్థులు, తల్లిదండ్రుల్లో ఆత్మ విశ్వాసం కలిగించేందుకు అవోపా ఆధ్వర్యంలో మెరిట్ విద్యార్థులకు సన్మాన కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందన్నారు. 10వ తరగతిలో పట్వారి రీతిక, గందె వర్ష, దొడ్డ నిఖిల్, ఇంటర్‌లో బజ్జూరి శశాంక్, పట్వారి శ్రీలక్ష్మి, పాలకుర్తి అర్చనను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు బెలిదె చందర్, దొడ్డ రాజ్‌కుమార్, బజ్జూరి మెడికల్ కృష్ణమూర్తి, గందె సోమన్న, పట్వారి కృష్ణ, దొడ్డ రమేష్, సంతోష్, వేణు, యుగంధర్, గందె సీతరాములు, అశోక్, నమశివాయ శ్రవణ్‌కుమార్, కమల, మాధవి, శిరిష పాల్గొన్నారు.

చిన్నారుల వేసవి ఆటల విడుపు



దేవరుప్పుల: విద్యాసంవత్సరం వార్షిక పరీక్షలు ముగియడంతో స్వగ్రామంతోపాటు అమ్మమ్మ ఊర్లోకి చుట్టపు చూపుగా వచ్చిన చిన్నారులు ఎంచక్కా గ్రామ శివారులో సాయంకాలం క్రీడలు ఆడుతున్నారు. ప్రపంచ వ్యాప్త క్రీడలైన క్రికెట్, వాలీబాల్‌తోపాటు చిర్రగోన వంటి గ్రామీణ క్రీడలతో శారీరక, మానసిక ఉల్లాసాన్ని గడుపుతున్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



పరామర్శిస్తున్న ప్రశాంత్‌రెడ్డి తదితరులు

బచ్చన్నపేట: మండలంలోని కేసిరెడ్డిపల్లి గ్రామంలో నారోజు దామోదరాచారి మృతి చెందాడు. కాగా ఆయన దశదిన ఖర్మకు పలువురు నాయకులు ఆదివారం హాజరై బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. దామోదరాచారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు కొమ్మూరి ప్రశాంత్‌రెడ్డి, కొడవటూర్ దేవస్థాన చైర్మన్ గాలి కృష్ణ, కౌన్సిలర్ మల్లవరం అరవింద్‌రెడ్డి, బద్దిపడిగె గోపాల్‌రెడ్డి, ఇమ్మడి దర్శన్‌రెడ్డి, చిక్కుడు మల్లేశం, బాల్నె రమేష్, చిక్కుడు కృష్ణ, బాల్నె రాజేష్ ఉన్నారు.

ఆర్థికసాయం

మండలంలోని కొన్నె గ్రామంలో సొప్పరి నర్సయ్య మృతి చెందాడు. కాగా సామాజిక సేవాకర్త కోడూరి శివకుమార్‌గౌడ్ బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.5 వేల సాయం అందజేశారు. సామాజిక సేవతోనే తృప్తి ఉందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో నాయకులు యాట రామచెంద్రయ్య, సత్తయ్య, మహేష్, కనుకయ్య, వెంకటయ్య, భాస్కర్, శ్రీనివాస్, కమలాకర్, రాములు తదితరులు ఉన్నారు.

అమ్మ ప్రేమ వెలకట్టలేనిది



ఝాన్సీరెడ్డిని సన్మానిస్తున్న సురేష్, రాజేష్

కొడకండ్ల: జీవితంలో అమ్మ ప్రేమ వెలకట్టలేనిదని, అమ్మ అనే పిలుపే విశ్వమని, ఆదర్శమని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ధరావత్ సురేష్‌నాయక్, నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ధరావత్ రాజేష్‌నాయక్ అన్నారు. ఆదివారం మదర్స్‌డేను పురస్కరించుకొని పాలకుర్తి కాంగ్రెస్ ఇన్‌చార్జ్ హనుమాండ్ల ఝాన్సీరెడ్డిని వారు కలిసి సన్మానించారు. అమ్మను మించిన దైవం విశ్వంలో మరొకటి లేదని వారు అకాంక్షిస్తూ మదర్స్‌డే శుభాకాంక్షలు తెలిపారు.

ప్రయోజకులను చేసేందుకు తల్లి తాపత్రయం



చంద్రకళ సన్మానిస్తున్న రాజేంద్రప్రసాద్

రామన్నపేట: పిల్లలు పుట్టినప్పటి నుంచి తల్లి అనేక ఆటుపోట్లను భరిస్తూ వారిని ఉన్నతులుగా తీర్చి ప్రయోజకులుగా చేసేందుకు అనేక త్యాగాలను చేస్తుందని రామన్నపేటలోని డాక్టర్ ఎ.రాజేంద్రప్రసాద్ భారతి చారిటబుల్ ట్రస్ట్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రాజేంద్రప్రసాద్ అన్నారు. మాతృ దినోత్సవం సందర్భంగా నగరంలోని బ్యాంక్‌కాలనీలో నివాసం ఉంటున్న 85 ఏళ్ల వృద్ధురాలు బ్రహ్మదేవుల చంద్రకళను ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం సన్మానించారు. ఈ సందర్భంగా రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ పిల్లలకు తల్లితో ఎక్కువ అనుబంధం ఉంటుందని అన్నారు. నేటి తరం పిల్లలు వారి తల్లిదండ్రులను వృద్ధాశ్రమం, అనాథాశ్రమంలో చేర్పిస్తూ పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అలా చేస్తే భవిష్యత్‌లోనూ తమకూ అలాంటి దుస్థితే ఎదురైయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు. కార్యక్రమంలో బ్రహ్మదేవుల సోమలింగం, ట్రస్ట్ సభ్యులు మంతెన రాజేష్, వేణుగోపాల్, లలిత, సాయి మోహిత్, రజనీకాంత్, ప్రభావతి, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

కంకర పోశారు.. రోడ్డు నిర్మాణం మరిచారు



కంకర పోసిన రోడ్డు



మట్టి కూలిన రోడ్డు

చిల్పూరు: మండలంలోని కృష్ణాజీగూడెం పంచాయతీ పరిధిలోని చక్రితండాకు ఆరు నెలల క్రితం బీటీ రోడ్డు నిర్మించేందుకు పనులు చేపట్టిన కాంట్రాక్టరు కంకర పోసి వదిలేయడంతో రైతులు, వాహన చోదకులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. చక్రితండాకు సరైన రోడ్డు సౌకర్యం లేక పోవడంతో తండా వాసులతో పాటు, రైతుల ఇబ్బందులను చూసిన గత ప్రభుత్వం బీటీ రోడ్డును మంజూరు చేసింది. పనులు చేపట్టిన కాంట్రాక్టర్ రోడ్డు వెంట ఉన్న చెట్లను తొలగించి మూడు చోట్ల వర్షపు నీరు వెళ్లేందుకు రోడ్డు కింద పైపులు వేశాక కంకరపోసి వదిలేశాడు. 6 నెలలు దాటినా పట్టించుకోకపోవడంతో పైపులు వేసిన చోట మట్టి కూలి కాలిబాటగా తయారైంది. దీంతో రైతులు పండించిన ధాన్యాన్ని రోడ్డు వెంట తీసుకవచ్చే వీలు లేక అదనపు ఖర్చుతో వేరే గ్రామం మీదుగా తెచ్చుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. ఇక ద్విచక్ర వాహనంపై కూడా రాత్రి సమయంలో వెళ్లలేక పోతున్నామని వాపోతున్నారు. అధికారులు స్పందించి రోడ్డు నిర్మాణ పనులు పూర్తిచేయాలని సీపీఎం గ్రామ కార్యదర్శి సాదం శ్రీనివాస్ డిమాండ్ చేశారు.